ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 40.3°C | కనిష్ఠం : 22.5°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.35 గం..

సహర్ : శనివారం ఉ : 4.44 గం..



నిర్మానుష్యంగా వెంకటరమణ జంక్షన్

భగభగ..

రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

- ఉమ్మడిజిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- బొగ్గుగని ప్రాంతాల్లో మరింత వేడిమి
- ఆరెంజ్ అలర్ట్ జారీతో యంత్రాంగాలు అప్రమత్తం

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండలు రారెత్తిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో సగటున 40 డిగ్రీలకు పైనే నమోదవుతుండటం, వడగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9గంటలకే సూరీడు సుర్రుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్లు వెలవెలబోతున్నాయి. గతేడాది కన్నా ఈ సారి ఎండలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 38 డిగ్రీలు నమోదవగా.. ఏప్రిల్‌లో తీవ్రత పెరుగుతూ వస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ప్రగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. అత్యధికంగా ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.1 డిగ్రీలు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో 41డిగ్రీలు, జనగామ జిల్లాలో 40.5డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 40.3 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో కాస్త తక్కువగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ములుగులో మరింతగా 42.9డిగ్రీలు, 42.3డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42.6డిగ్రీలు, జనగామలో 41.6డిగ్రీలు, వరంగల్‌లో 41.7డిగ్రీలు, హనుమకొండలో 41.5 డిగ్రీలకు పెరగొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం లేక రోడ్ల పక్కన చిరువ్యాపారాలు మంద గించాయి. దీంతో ఆ పేద, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, అంబలి, సోడ తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది.

పెరుగుతున్న వడదెబ్బ బాధితుల సంఖ్య

ఎండల తీవ్రత, ఉక్కపోత, వడగాలుల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అందు వల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు, వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే వడదెబ్బబారిన పడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బయట పనులకు వెళ్లే కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎండబాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.





సోడా దుకాణం వద్ద రద్దీ

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

ఎండల తీవ్రతతో ఉమ్మడి జిల్లాలో తరుచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవి వేళ సంభవించే ఈ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రహదారుల వెంట పేరుకుపోతున్న చెత్త, రాలిన ఎండు ఆకులు, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించడం లేదు. దీంతో తాగిపడేసిన బీడి, సిగరెట్ పీకల ద్వారా మంటలు అంటుకుంటున్నాయి. అలాగే ఏసీలు, కూలర్లు వినియోగం ఎక్కువడంతో సామర్థ్యానికి మించి విద్యుత్ వాడకం పెరిగి షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వరంగల్ పోచ మ్మమైదాన్‌లోని ఒక షాపింగ్ కాంప్లెక్సులో షార్ట్ సర్క్యూట్ వల్ల భారీ అగ్నిప్రమాదం జరిగింది తెలిసిందే. ములుగులో ఎండ తీవ్రత వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని అడవిలో కార్చిచ్చు చెలరేగింది.

వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వడదెబ్బకు గురైనప్పుడు శరీర ఉష్ణోగ్రత తీవ్రం గా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూ త్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావ టం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లే లక్షణాలు కనిపిస్తాయి. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. ఎండదెబ్బ తగిలినవారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. సత్వర చర్యల కోసం 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స తర్వాత ఆసుపత్రులకు తరలించాలి. అయితే ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆటలాడటం చేయొద్దు. తప్పనిసరి అయితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించాలి. నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మత్తుపానీయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వేసవిలో జాగ్రత్తగా ఉండాలి. బయట పనికి వెళ్లేవారు ఉదయం, సాయంత్రం వేళల్లో పని చేసుకొని మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకోవాలి.



జన సంచారంలేని కాళోజి జంక్షన్

నిప్పుల కుంపటిగా బొగ్గుగనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొగ్గుగని ప్రాంతాలైన భూపాలపల్లి టౌన్, తాడిచెర్ల, గణపురం మండలంలోని మాధవరావుపల్లె ఓపెన్ కాస్టులు, వాటి పరిసరాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. సహజంగా బొగ్గునిల్వలు, ఓపెన్‌కాస్టులు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుంది. దీని కితోడు ఎండలు మండిపోతుండడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే నీటితో ఈ ప్రాంతాలను చల్లబరచాల్సి ఉంటుంది. అలాగే సిబ్బందికి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బయట 40 డిగ్రీలు ఉంటే ఓపెన్ కాస్టులలో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉండటంతో సంస్థ అధికారులను అప్రమత్తం చేస్తోంది.



విద్యుత్ దీపాల వెలుగుల్లో నిట్ పరిపాలన భవనం

సందడే.. సందడి

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన ప్రాంగణం
- హాజరుకానున్న పది వేలమంది విద్యార్థులు

వివరాలు : 7 లో..

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- శాంతిభద్రతల పరిరక్షణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకం
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బందితో పాటు సెక్టార్ విభాగం ఎస్‌ఐలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించడంతో పాటు, వారికి అప్పగించిన పనులపై కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్‌పై ఉందన్నారు. ఫిర్యాదుపై క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, పోలీస్ అధికారులకు నివేదిక ఇవ్వ డం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకమన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పనితీరుపై అధికారుల పర్యవేక్షణ ఉంటుందని వివరిం చారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితెందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష


వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఈనెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10 తరగతుల్లో ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 6 మోడల్ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



జడ్పీ సమావేశంలో చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, సీఈవో రాంరెడ్డి తదితరులు

కోరం లేక వరంగల్.. జడ్పీ సమావేశం వాయిదా

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 4 : వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. పాలకవర్గ సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి వెల్లడించారు. బుధవారం సమావేశ ప్రారంభ సమయానికి చైర్‌పర్సన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు అదాలత్ ప్రాంతంలోని జడ్పీ కార్యాలయానికి చేరుకున్నారు. చైర్‌పర్సన్‌తో పాటు సీఈవో రాంరెడ్డి తదితర అధికారులు సమావేశ మందిరానికి చేరుకున్నారు. అయితే మొత్తం 16 మంది జడ్పీటీసీల్లో వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం బిక్షపతి ఒక్కరే హాజరయ్యారు. సభ నిర్వహణకు కనీసం 5 సభ్యులు పాల్గొనాలి. ఒక్క జడ్పీటీసీ మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో నిబంధనల మేరకు సభను వాయిదా వేశారు. లోక్‌సభ ఎన్నికల క్రమంలో కేవలం శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహణకే సభ పరిమితమే, ఆ మేరకు నిర్వహణ జరపాలని ముందే నిర్ణయించారు. అయితే కోరం లేకపోవడంతో మొత్తం సమావేశమే వాయిదా పడడంతో వచ్చిన అధికారులు వెళ్లిపోయారు.



కేవలం అధికారులే పాల్గొనగా సభ్యులు లేక ఖాళీగా కనిపిస్తున్న సమావేశ మందిరం

వరంగల్ ఆర్డీవో ఆఫీసు జప్తునకు హైకోర్టు ఆదేశం

- టెక్స్‌టైల్ పార్కు భూమి పరిహారం విషయంలో రైతుకు అనుకూలంగా ఉత్తర్వులు
- రూ.2.40 కోట్లు చెల్లించాలని గతంలోనే చెప్పినా పట్టించుకోని అధికారులు



వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న హైకోర్టు నుంచి వచ్చిన అధికారులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4 : టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించిన భూమిలో ఓ రైతుకు పరిహారం చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. సదరు రైతుకు రూ.2.40కోట్లు చెల్లించాలని చెప్పినా పట్టించుకోలేదని, ఇకనైనా ఆ సొమ్మును అతడికి చెల్లించాలని లేదంటే వరంగల్ ఆర్డీవో కార్యాలయాన్ని ఆ రైతుకు జప్తు చేయాలని ఉత్తర్వులిచ్చింది. భూమి పరిహారం విషయంలో తనను ఆశ్రయించిన రైతుకు అనుకూలం హైకోర్టు ఇచ్చిన ఉత్వర్వులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం హైకోర్టు నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సంజయ్, రైతు తరపు న్యాయవాది నాగేంద్రచారి వరంగల్ కలెక్టరేట్‌కు చేరుకుని ఆర్డీవోను కలిసేందుకు ప్రయత్నించగా ఆయన సెలవులో ఉండటంతో డీఆర్వోను కలిసి విషయాన్ని తెలపగా తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కొంత గడువు కావాలని కోరారు. దీంతో హైకోర్టు నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సంజయ్ ఉత్తర్వుల కాపీని వరంగల్ ఆర్డీవో కార్యాలయ గోడకు అంటించి వెళ్లిపోయారు.

వివాదానికి సంబంధించిన వివరాలివీ..

వరంగల్‌లో ఆజంజాహి మిల్లు మూతపడి భూములను సైతం అమ్ముకోవడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఆ తర్వాత జిల్లాలో అంత పెద్ద పరిశ్రమ మరొకటి లేకుండా పోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకంటే పెద్ద పరిశ్రమను నెలకొల్పాలని సంకల్పించింది. 2016లో నగరానికి సమీపంలో పరకాల నియోజకవర్గ పరిధిలోని గీసుగొండ మండల శాయంపేట సమీపంలో సుమారు 1400 ఎకరాల భూమిలో టెక్స్‌టైల్ పార్క్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వ భూమితో పాటు పలువురు రైతుల నుంచి భూములను సేకరించింది. రైతుల నుంచి తీసుకున్న భూమికి గాను ఎకరానికి నష్టపరిహారంగా రూ.9.90 లక్షల ధర నిర్ణయించి చెల్లింపులు చేసింది. ఈ క్రమంలో శాయంపేటకు చెందిన సముద్రాల యాకస్వామి, ఆయన కూతురు వెన్నెలకు సంబంధించిన 20 ఎకరాల భూమిని కూడా సేకరించింది. కానీ అందరిలా కాకుండా వారికి నష్టపరిహారం తక్కువ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా యాకస్వామికి చెందిన 12ఎకరాలకు ఎకరానికి రూ.8.90లక్షల చొప్పున మాత్రమే చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో యాకస్వామి అంగీకరించలేదు. తన భూమిని టెక్స్‌టైల్ పార్కుకు ఇవ్వనని భీష్మించినా.. అధికారులు మాత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులను కలిసినా పట్టించుకోకపోవడంతో.. యాకస్వామి 2022లో న్యాయవాది నాగేంద్రచారి ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. పలుమార్లు వాదనలు, ప్రతి వాదనలు విన్న హైకోర్టు ఆరు నెలల క్రితం యాకస్వామికి సంబంధించిన భూమికి గాను రూ.2.40కోట్లు చెల్లించాలని వరంగల్ ఆర్డీవోను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను తీసుకుని రైతు యాకస్వామి పలుమార్లు ఆర్డీవోతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో.. తన న్యాయవాది ద్వారా మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆర్డీవో, ఇతర అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు సదరు రైతుకు వెంటనే డబ్బులు చెల్లించాలని లేదంటే ఆర్డీవో కార్యాలయాన్ని ఆయనకు జప్తు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.



వరంగల్ ఆర్డీవో కార్యాలయం



భూమి తీసుకున్నారు డబ్బులు చెల్లించలేదు : యాకస్వామి

టెక్స్‌టైల్ పార్క్ కోసం నాది, నా కూతురు వెన్నెలకు కలిపి ఉన్న 20ఎకరాల భూమిని 2016లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందరి రైతుల్లా పరిహారం ఇవ్వమని అడిగితే నిర్లక్ష్యం చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయిస్తే ఇరువర్గాల వాదనలు విని అధికారులు మాకు రూ.2.40కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఆ ఆదేశాలిచ్చి ఆరు నెలలయినా అధికారులు స్పందించడం లేదు. దీంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించగా ఆర్డీవో కార్యాలయాన్ని మాకు జప్తు చేయాలని అధికారులను ఆదేశించింది.

నియోజకవర్గాలకు ఈవీఎం మిషన్ల కేటాయింపు పూర్తి

కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 4: వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజక వర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏనుమాముల మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాం నంబర్ 12ను ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల సమక్షంలో గోదాం తెరిచి ర్యాండమైజేషన్ చేయబడిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్‌లను కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. వరంగల్ తూర్పుకు సంబంధించి 11వ నంబర్ గోదాంలో, వర్ధన్నపేటకు సంబంధించి 17వ నంబర్ గోదాంలో, నర్సంపేటకు సంబంధించి నర్సంపేట వ్యవ సాయ మార్కెట్ యార్డులోని ప్రత్యేక స్ట్రాంగ్ రూంకు తరలించి పటిష్ఠమైన భద్రత రక్షణలో ఉంచుతామని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్‌రావు, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, ఉప తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఎం పాల్గొన్నారు.



ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గొర్రెల మందపైకి దూసుకుపోయిన కారు

ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : అతివేగంతో కారు గొర్రెల మందపైకి దూసుకుపోవడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన దిన ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ శివారులో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ధర్మసాగర్‌కు చెందిన గొర్రెలకాపరులు గంటె రమేష్, గంటె సంపత్, గంటె సాంబరాజు, అల్లాడి పెద్దపురం, గంటె పెద్ద కొంరయ్య, చిన్న కొంరయ్యలకు చెందిన గొర్రెలను మేతకు తోలుకుపోయారు. శాయిపేట్ వైపు నుంచి గొర్రెలను మేపుకొని తిరిగి ధర్మసాగర్‌కు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్దకు రాగానే కారు అతివేగంతో వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది గొర్రెలకు గాయ్యాలయ్యాయి. కాగా, మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిందితులను గొర్రెలకాపరులు పోలీసులకు అప్పగించారు.


ఎలుకుర్తి క్రాస్ వద్ద గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో మృతి చెందిన, గాయపడిన గొర్రెలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వస్కుల రాజు(ఫైల్)

మడికొండ, ఏప్రిల్ 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాలప్రకారం. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు (37)కు మడికొండ ఎస్సీ కాలనీలోని రజితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో మడికొండలో నివాసముంటున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో ఆటో నడుపుకునే రాజు కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలో అతను ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు ఉదయం వేళ ఇంట్లో వారు లేచి చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రైలులో బాలుర తరలింపు

పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 4 : రైలులో తరలిస్తున్న బాలకార్మికులను పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన ప్రకారం. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం వివిధ ప్రాం తాల నుంచి బాలురను తరలిస్తున్నారన్న సమాచారంతో కాజీపేటలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 11 మంది బాలురు, వారిని తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. విచారించగా వేసవి సెలవులు ఉన్నందున బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌లో పని చేయించేందుకు బాలురలను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బాలురను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలల్లో రైల్వే సీఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు 5రోజుల వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 4 : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు, మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలు ఖరారు

హనుమకొండ టౌన్ / కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 : ఎంపీఈడీ, బీపీఈడీ పరీక్ష తేదీలను గురువారం కేయూ పరీక్షల విభాగం ప్రకటించింది. ఈనెల 18, 20, 23, 25 తేదీల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్, ఈనెల 16, 19, 22, 24 తేదీలలో ఎంపీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు, అదే విధంగా ఈనెల 16, 18, 20, 22 తేదీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్ మార్చి 4 : ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మార్చి 16 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పాట్ క్యాంపు ముగిసిందని క్యాంపు ఆఫీసర్ ఎ.గోపాల్, అదనపు క్యాంపు అధికారి కె. మాధవరావులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనరల్ విభాగంలో 7.5 లక్షల జవాబు పత్రాలు రాగా, వొకేషనల్ విభాగంలో 1.5 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటన్నింటి మూల్యాంకన ప్రక్రియ పూర్తియ్యిందని తెలిపారు. స్పాట్ క్యాంపులో 361 మంది సీఈలు, 1,838 మంది ఏఈలు, 361 మంది స్క్రూటినీ సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడంతో మరో పది రోజుల్లో బోర్డు మార్కుల పోస్టింగ్‌ను పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఈనెల 12వ తేదీ వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జేఈఈ మెయిన్స్ పరీక్ష హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన షిఫ్ట్-1 పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.63 శాతం మంది విద్యార్థులు మొదటి షిఫ్ట్‌లో హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన రెండవ షిఫ్ట్ పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 713 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.25 శాతంమంది విద్యార్థులు మొదటిషిఫ్ట్‌లో హాజరయ్యారు. కాగా నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎర్రగట్టు గుట్ట, నోబుల్ టెక్నాలజీస్, చింతగట్టు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంటలో గురువారం జేఈఈ మెయిన్స్-2024 పరీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఈనెల 12 వరకు రెండు షిఫ్టుల్లో జరిగే పరీక్షకు 8,627 మంది పరీక్ష రాయనున్నారు.

భార్యకు దూరంగా ఉంటున్న భర్తపై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోండగానే భార్య కుటుంబసభ్యులు భర్తపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని రాయపురాకు చెందిన గుండెబోయిన మహేశ్ ఆయన భార్య అపర్ణకు సంబంధించి విడాకుల కేసు గత రెండేళ్ల నుంచి కోర్టులో కొనసాగుతోంది. ఈ క్రమంలో అపర్ణ కుటుంబసభ్యులు మ్యాదరబోయిన రాజేందర్, మ్యాదరబోయిన రాజ్‌కుమార్, రవి ఈనెల 1న రాయపురలోని మహేశ్ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు మనుషులపై దాడి చేశారు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం..


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న లెక్చరర్

కేసముద్రం, ఏప్రిల్ 4 : పదో తరగతి పూర్తిచేసి.. ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు వరంగా మారాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభకు వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ గురుకుల కళాశాలలు బాటలు వేస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పింది. వీటిలో 15 బాలురకు, 14 బాలికల కోసం ఏర్పాటు చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రవేశపరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,480 సీట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 29 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో 2480 సీట్లున్నాయి. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏడు కళాశాలల చొప్పున, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఐదు చొప్పున, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం 29 కళాశాలలున్నాయి. ఈ 29 కళాశాలల్లో 15 బాలురకు, 14 బాలికలకు కేటాయించగా బాలురకు 1,360 సీట్లు, బాలికలకు 1,120 సీట్లు మొత్తం 2,480 సీట్లు ఉన్నాయి. ఈ గురుకులాల్లో బీసీలకు 75 శాతం సీట్లు కేటాయించగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5శాతం ఓసీ లేదా ఈ బీసీలకు 2శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఆయా రిజర్వేషన్లలోనే 3శాతం దివ్యాంగులకు, 25 శాతం సీట్లను జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షకు 2024లో పదో తరగతి రెగ్యులర్‌లో పూర్తి చేసిన వారే అర్హులు. గతంలో పాసైన వారు, సప్లమెంటరీ రాసిన వారు ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం

- ఇంటర్‌లో ఉచిత వసతి, విద్య
- ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ
- 'సూపర్-100' పేరుతో ప్రత్యేక కోచింగ్
- బీసీలకు 75 శాతం సీట్లు రిజర్వు
- ఉమ్మడి జిల్లాలో 29 కళాశాలలు 2,480 సీట్లు
- ప్రవేశ పరీక్ష కోసం 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

గురుకుల కళాశాలల ప్రత్యేకతలు, సౌకర్యాలివే..

- కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలోనే బోధన
- ప్రతీ తరగతి గదిలో డిజిటల్ క్లాసులు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం.
- ఉదయం వ్యాయామంతో ప్రారంభించి 7.30 నుంచి 9గంటల వరకు బోధన కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆట స్థలాల సౌకర్యం
- ఉచిత బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు
- కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- విద్యార్థులపై 24గంటల పాటు అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్‌తో పాటు ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్‌లో శిక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేసి 'సూపర్-100' బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, ఎంసెట్‌లలో శిక్షణ.

జిల్లాల వారీగా కళాశాలలు..

ఉమ్మడి జిల్లాల్లోని జనగామ జిల్లాలో బచ్చన్నపేటలో బాలికలు, బాలురకు వేర్వేరు గురుకులాలున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాలురు, రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొగుళ్లపల్లిలో బాలురు, గాంధీనగర్ ఘన్‌పూర్‌లో బాలికలు, భూపాలపల్లిలో బాలురు, ములుగు జిల్లా వెంకటాపురంలో బాలురు, పాకాల కొత్తగూడలో బాలికలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బాలికలు, గుమ్మడూరులో బాలురు, పెద్దవంగరలో బాలురు, పెద్దగూడూరులో బాలికలు, దంతాలపల్లిలో బాలురు, వరంగల్ జిల్లా నెక్కొండలో బాలికలు, నల్లబెల్లిలో బాలురు, సంగెంలో బాలురు, వరంగల్‌లో బాలికలు, ఖిలా వరంగల్‌లో బాలురు, తిమ్మాపూర్‌లో బాలికలు, వర్ధన్నపేటలో బాలికలు, హన్మకొండ జిల్లా శాయంపేటలో బాలురు, ఆత్మకూరులో బాలికలు, హన్మకొండలో బాలురు, కాజీపేటలో బాలికలు, ఐనవోలులో బాలురు, కమలాపూర్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలున్నాయి.



ఎంజేపీ గురుకుల కళాశాల బాగుంది..

- సందిరి రవి, విద్యార్థి తండ్రి, కేసముద్రం స్టేషన్

మహబూబాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో నా కుమారుడు జగదీశ్వర్ ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. నాణ్యమైన విద్య, బోధన ఈ కళాశాలలో అందుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ఈ గురుకుల కళాశాలలు ఒక వరంగా మారాయి. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

- వై.మనోహర్‌రెడ్డి, ఆర్‌సీవో, ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉచిత బోధన కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గత ఏడాది ఇంటర్ ప్రవేశపరీక్షను ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఈ గురుకులాల్లో అన్ని అర్హతలు గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉటుంది. మెరుగైన విద్యార్థులకు 'సూపర్-100' గ్రూప్‌కు ఎంపిక చేసి సీవోఈ కళాశాలలో ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

శాయంపేట(హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : ప్రేమపేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కొప్పులకు చెందిన పసుల శివరాజ్ ఓ బాలికను నెలరోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడని చెప్పారు. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి గ్రామంలో కిరాణంషాపుకు వెళ్తున్న బాలికను వేధించాడు. దీంతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో శివరాజ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

110 ఏళ్ల అమ్మకు అన్నీ తానై..

ఆస్తుల్లేకపోయినా సాకుతున్న వృద్ధురాలు

నర్సంపేట టౌన్, మార్చి 4 : ఆస్తులు లేవు.. పనులు చేసుకునేందుకు సత్తువ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పింఛనే ఆసరాగా నూరేళ్ల వయసుపైబడిన తల్లిని సాకుతోంది 80ఏళ్ల వృద్ధురాలు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఓ కన్ను కనిపించకపోయినా కని పెంచిన అమ్మ బాగోగులు చూస్తోంది. ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కూడా వదిలేస్తున్న వారున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాలెన్ని ఎదురైనా తల్లిని కంటికిరెప్పలా కాపాడుకుంటోంది నర్సంపేట మండలం జీజీఆర్ పల్లె గ్రామానికి చెందిన నానబోయిన వెంకటమ్మ. దీనికి సంబంధించిన వివరాలివీ.. జీజీఆర్‌పల్లె గ్రామానికి చెందిన వేల్పుల మలమ్మకు 110 ఏళ్లు. మల్లమ్మ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా వారికి వివాహాలయ్యాయి. ఓ కూతురును వేరే ఊరు ఇవ్వగా.. వెంటకమ్మను తమ స్వగ్రామంలోనే ఇచ్చారు. అయితే వెంకటమ్మ భర్త కూడా గతంలోనే మృతిచెందడం.. ఆమె ఇద్దరు కుమారులు కూడా వివాహాలై వేర్వేరుగా ఉంటుండగా వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న వెంకటమ్మ.. 110ఏళ్ల పైబడిన తల్లి మల్లమ్మను ఒంటరిని చేయకుండా తనకున్న గుడిసెలోనే ఉంచి సపర్యలు చేస్తోంది. అయితే వెంకటమ్మ వయసు 80 సంవత్సరాలు కాగా ఆరోగ్యం సహకరించకపోయినా.. ఓ కన్ను సరిగా కనిపించకపోయినా తల్లి ఆలనాపాలనా మాత్రం మరవలేదు. ఉండడానికి పూరిగుడిసె తప్ప ఎలాంటి ఆస్తులు, ఆదాయం లేకపోవడంతో తల్లీకూతుళ్లకు ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛనుతోనే బతుకీడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


తల్లితో కూతురు వెంకటమ్మ

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4: భారత తొలి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను మార్చి5న శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తాని వెల్లడించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కంటెపరరీ ఇష్యూస్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సులో మాజీ తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీ బి. చంద్రకుమార్ కీలక ప్రసంగం చేస్తారన్నారు.

రేగులగూడెం వాసికి డాక్టరేట్



కాటారం, ఏప్రిల్ 4: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేష్‌కుమార్ డాక్టరేట్(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇంజనీ రింగ్(సీఎస్ఈ) విభాగంలో డాక్టర్ ఫిలాసఫీ అవార్డు పొందారు. 'ఎఫీషియంట్ అప్రోచెస్ ఫర్ డ్రైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించడంతో మహేష్ కుమార్ పీహెచ్‌డీ సాధించారు.



క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రోషోల ఫ్లెక్సీ



స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైన నిట్ ప్రధాన గేట్ తోరణం

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన పాంగణం
- హాజరుకానున్న 10 వేలమంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : కాజీపేటలోని నిట్ ప్రాంగణంలో సందడి నెలకొననుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'టెక్నోక్రాట్స్' సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు దుమ్మురేపనున్నారు. ఈ ఏడాది 'సృజనాత్మకత శక్తితో కూడిన పండుగను వాగ్దానం చేయడం, పాల్గొనే వారి గత పరిమితులను అధిగమించి వారిలో దాగిఉన్న శక్తిని బయటకు తీయడం (ఋఖిఞాఎఞా)' అనే థీమ్‌తో వసంతోత్సవాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు. భావిభారత ఇంజనీర్లు సాంస్కృతిక సంబరాల్లో మునిగి తేలనున్నారు. ఈ స్ప్రింగ్‌స్ప్రీలో నిట్‌లోని విద్యార్థులతో పాటు మొత్తం 10 వేలమంది స్టూడెంట్స్ కేరింతలు కొట్టనున్నారు. నేడు సాయంత్రం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిట్ స్టూడెంట్స్ డీన్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమాలు ఇలా..

● మొదటి రోజు

అన్ సాల్వ్‌డ్ నుక్కడ్ నాటకం, నిట్ వరంగల్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఫుడ్ హంట్‌తో పాటు ప్రోషోలో ప్రముఖ గాయకుడు హరిచరణ ఆధ్వర్యంలో చౌరస్తా బ్యాండ్ కార్యక్రమం ఉర్రూతలూగించనుంది.

రెండోరోజు..

నిట్ వరంగల్ సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్‌క్విజ్, హంగ్‌గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలో విద్యార్థులను తన్మయత్వంలో ముంచనున్నారు.

మూడోరోజు..

జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలేతో స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమం ముగియనుంది.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం


స్రవంతిని అభినందిస్తున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వేలేర్ కేజీబీవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్. స్రవంతిని డీఈవో అబ్దుల్‌హై అభినందించారు. జీసీడీవో సునిత ఆధ్వర్యంలో బంగారు పతకం సాధించిన స్రవంతిని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హై పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కాగా గత నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు తరపున పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. జీసీడీవో సునిత, పీఈటీ కిరణ్మయి, ఎస్‌వో స్రవంతి, హనుమకొండ సాఫ్ట్‌బాల్ సెక్రెటరి తాబేటి రాజేందర్ తదతరులు స్రవంతిని అభినందించారు.



కాంస్య పతకం, ప్రశంసా పత్రం


సాంబమూర్తి

చిత్రకళలో సాంబమూర్తికి కాంస్య పతకం

కరీమాబాద్, ఏప్రిల్ 4 : రంగ్-23 2వ నేషనల్ వైడ్ ఆర్ట్ అండ్ పెర్ఫామెన్స్ కాంపిటీషన్‌లో ఉర్సు కుమ్మరివాడ ప్రాంతానికి చెందిన ఆవునూరి సాంబమూర్తి కాంస్య పతకం సాధించాడు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రకళ పోటీలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబాయిలోని వెర్సోవా వెల్ఫేర్ అసోసియేషన్ హైస్కూల్‌లో గత ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించారు. సాంబమూర్తి 'సర్వాంతర్యామి భారత్' అనే సందేశం చిత్రాన్ని పోస్టు ద్వారా కాంపిటీషన్‌కు పంపించాడు. 40నుంచి 60 ఏళ్ల కేటగిరీలో ఆయనకు తృతీయ బహుమతిని లభించింది. నిర్వాహకులు సాంబమూర్తికి సమాచారం అందించి, కాంస్య పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని పోస్టుద్వారా పంపించగా గురువారం ఉదయం తనకు చేరినట్లు సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అక్కంపేటలో తాగునీటికి కటకట

● వారం రోజులుగా ప్రజల ఇబ్బందులు ● వ్యవసాయ బావుల వద్దకు పరుగులు

ఆత్మకూరు (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడంతో నల్లానీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిందని గుంతలు తీయించారు. వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు లేక ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. పలుమార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. లేని పక్షంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పట్టించుకోని అధికారులు..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యతను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పత్తాలేకుండా పోవడంతో నీటి సమస్యను ఎవరు పరిష్కరించాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలిన దృశ్యం



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8

వరంగల్ సిటీ

• వరంగల్ • ఖిలావరంగల్ • గీసుగొండ • సంగం

శుక్రవారం 5 ఏప్రిల్ 2024



శిక్షణ పొందుతున్న ఎన్నికల కేంద్రాల నిర్వాహకులు

ఎన్నికల కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ

సంగెం, ఏప్రిల్ 4: బొలికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బుధవారం ఎన్నికల కేంద్రాని నిర్వాహకులకు ఇచ్చే శిక్షణను గురువారం ప్రారంభించారు. శిక్షణ ఇన్‌చార్జి, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శిక్షణను ప్రారంభించి, ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఉద్యోగులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఓటర్ల గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాతనే హాలులో ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. ఈ శిక్షణకు 557మంది హాజరు కావాల్సిన ఉండగా 539 మంది ఉద్యోగులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్‌సాగర్ పాల్గొన్నారు.

మట్టిపాలవుతున్న బతుకులు

• చాలీచాలని కూలితో వలసల అవస్థలు • కానరాని మౌలిక వసతులు • నిబంధనలకు నిర్వాహకుల తూట్లు

సంగెం, ఏప్రిల్ 4: బతుకుదెరువు కోసం వలస వచ్చిన కూలీల బతుకులు దయనీయంగా మారాయి. గుంటూరుపల్లి, కాపులకనపర్తి, ఆశాలపల్లి, చింతలపల్లి తదితర ప్రాంతాల్లో ఇటుకలను తయారు చేసేందుకు చిన్న పిల్లలతో పలు కుటుంబాలు తరలివచ్చి పనులను చేస్తున్నారు. తెల్లవారు జామున నుంచే పనుల్లో నిమగ్నమై పొద్దస్తమానం పనుల్లో మునిగి తేలుతున్నారు. నిత్యం ఎండకకా.. వానకకా కుటుంబం మొత్తం పనిచేస్తే వచ్చేది చాలీచాలని జీతమే. ప్రతీ వెయ్యి ఇటుకల తయారీకి ఇచ్చేది కేవలం రూ.300 మాత్రమే. ఒక్కో వ్యక్తి రోజంతా కష్టపడినా రెండు వెలకు మించి ఇటుకలు తయారు చేయడం గగనమే. ఈలెక్కన రోజు కూలి రూ.600 మించదు. మహారాష్ట్ర, బీదర్ తదితర రాష్ట్రాలోని పేద కుటుంబాల నుంచి ఇటుక బట్టీల యజమానులు కూలీలను తరలించారు. బట్టీల సమీపంలోనే గుడిసెలు వేసుకుని కూలీలు బతుకులీడిస్తున్నారు. ఉడికీ ఉడకని అన్నంతో పొద్దస్తమానం పని చేయడంతో పాటు రాత్రివేళల్లో సైతం మట్టిని నీటితో తడిపి ముద్దగా చేసుకుంటున్నారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న ఇటుకలు

కరువైన మౌలిక వసతులు..

ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు యజమానులు కనీస వసతులు కూడా కల్పించడం లేదు. నీటివసతి, స్నానాల గదులు, మరుగుదొడ్లు లేకపోవడం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూలీలు దుమ్ము, దూళి, పొగల మధ్యన పని చేసి అనారోగ్యానికి గురవుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్వరం వచ్చిన, ప్రమాదాలకు గురైన సమయంలో సరైన వైద్యం సౌకర్యాలు లేక ఇబ్బందులు పడినప్పటికీ పటింపులు కరువయ్యాయని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. రాత్రి వేళల్లో విషపురుగులతో సహవాసం చేయాల్సిందేనని చెబుతున్నారు.

స్థానికులకు తప్పని ఇబ్బందులు

ఇటుకల బట్టీల తయారీతో నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఇటుకల బట్టీలు కాలుస్తున్నారని, దీంతో బూడిద ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములపై పడడం వలన పంటలు దిగుబడి తగ్గిపోతోందని వాపోతున్నారు. ఒక్కోసారి బూడిద ఎక్కువై పొలాల్లోని మొక్కలు మాడిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. కాలుష్య నివారణ శాఖ, స్థానిక గ్రామ పంచాయతీ అనుమతులు కొంత మంది తీసుకున్నప్పటికీ ఇదే అదనుగా భావించిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా బట్టీలను ఏర్పా టు చేస్తున్నారని ఆయా ప్రాంత గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటుకల తయారీ అనంతరం వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు లారీల్లో, ట్రాక్టర్లలో తరలించే క్రమంలో ఇటుకల పైన ఎలాంటి పాలిథిన్ కవర్లను కప్పకపోవడం వలన వాటి వెనుకాల వెళ్లే వాహనాల పైన ఉన్న వారికి కళ్లల్లో బూడిద పడి పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.





ఇటుకలు తయారు చేస్తున్న కార్మికుడు, ఇటుకలను తరలిస్తున్న కూలీలు

భద్రకాళి సన్నిధిలో ప్రాసిక్యూషన్ అధికారి జయంతిమాల

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 4: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారి వై.జయంతిమాల దర్శించుకున్నారు. గురువారం అమ్మవారి ఆలయానికి అధికారిని చేసుకొని ఆలయంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనార్థం వచ్చిన ప్రాసిక్యూషన్ అధికారి వై.జయంతిమాల అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం అందించారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ప్రాసిక్యూషన్ అధికారి జయంతిమాల

శ్రీరత్నగర్భ గణపతి ఆలయంలో వార్షిక పూజలు

గిర్మాజీపేట, ఏప్రిల్ 4: నగరంలోని దయానంద్ కాలనీ శ్రీరత్నగర్భ గణపతి ఆలయ వార్షిక మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు కురవి రాజేశ్వరశర్మ అభిషేకం, అర్చనల అనంతరం మహా హోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దొడ్డ పోలయ్య, కార్యదర్శి ధనేకుల రాంబాబు, ఉపాధ్యక్షుడు కాపా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కాపా శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ మేనేజర్ అశోక్, నాగరాజు పాల్గొన్నారు.



శ్రీరత్నగర్భ గణపతి దేవాలయంలో హోమం

రామాలయానికి పంచలోహ విగ్రహాల వితరణ

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి పంచలోహ ఉత్సవమూర్తుల విగ్రహాలు, ఏయిర్‌కూలర్‌ను సీతారామచంద్రస్వామి దేవాలయానికి వోడ్నాల మల్లయ్య, కుటుంబసభ్యులు దేవాలయానికి అందజేశారు. గురువారం శివనగర్‌లోని రామాలయంలో మల్లయ్య కుటుంబసభ్యులు అర్చకుల అనంతరం అందజేశారు. ఈనెల 17న జరిగే సీతారామకళ్యాణానికి సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మల్లయ్య కుటుంబసభ్యులు వోడ్నాల సదానందం, వోడ్నాల నరేందర్, వోడ్నాల రాజు-దంపతులు, రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, కోశాధికారి చింతం యాదగిరి, సహాయ కార్యదర్శులు బుదారపు భాస్కర్, ఆడెపు సాంబమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కొండి రాజమౌళి, శ్రీరాం రాజేష్, ట్రస్టు సభ్యులు బండి రమేష్, బత్తుల నవీన్‌కుమార్, పాల్గొన్నారు.



పంచలోహ విగ్రహాలు

బాలుర ఆశ్రమ గృహానికి చేయూత

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 4: దేశాయిపేటలోని బాలుర ఆశ్రమ గృహానికి సామాజిక సేవ సంస్థ నిర్వాహకులు చేయూతనందించారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం బోదాసు నవత సహకారంతో 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎలుకపెల్లి శ్రీధర్, సంస్థ సభ్యులు శరత్, మహేశ్, రాజేష్, రేవంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

హాజరైన మేయర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్

ఏకశిల నగర్, ఏప్రిల్ 4: నగరంలోని శిరంగిరాజారాం తోట డివిజన్‌లో వైభవంగా బొడ్రాయి వేడుకలు గురువారంతో ముగిశాయి. వేద పండితులు బ్రహ్మశ్రీ భాస్కరాచార్యులు బృందం నాలుగు రోజులపాటు పూజాదికాలు నిర్వహించారు. బొడ్రాయి దేవతను నగర మేయర్ గుండు సుధారాణి, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ రవి, బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు తాటిపాముల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి చిలువేరు రవీందర్, పరదేశ్ రాజేష్, బొల్లం మధు, చిలువేరు రాజేందర్, కొండా సుధాకర్, మీరుపెల్లి వినాయక్, బైరి ప్రతాప్, హరికృష్ణ, సతీష్, పూర్ణచందర్, వలపదాసు మధు, సురేష్, కోదాటి సురేష్, జగన్, ఓంప్రకాష్, శ్రవణ్ పాల్గొన్నారు.



బొండ్రాయి దేవతను దర్శించుకున్న మేయర్ గుండు సుధారాణి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

సంగెం, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే టి.రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. కాట్రపల్లిలో గురువారం మండల బీజేపీ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుతున్నట్లు రాజేశ్వరరావు చెప్పా రు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థి రమేష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, డాక్టర్ విజయ చందర్‌రెడ్డి, వడ్డి దేవేందర్‌రెడ్డి, వీరన్న, కొమ్మాలు, యాదగిరిరావు పాల్గొన్నారు.

ఘనంగా అరూరి జన్మదిన వేడుకలు

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ జన్మదిన వేడుకలను ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిమళ్ల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని శ్రీస్వయంభూశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో రమేష్ పేరున అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. 35వ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వైట్ల గణేష్ అధ్యక్షతన శివనగర్‌లోని డాన్‌బా స్కో అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 21, 33, 36, 37, 38 డివిజన్‌ల బీజేపీ అధ్యక్షులు కొమాకుల నాగరాజు, ముద్దసాని కృష్ణ, పుప్పాల శ్రీనివాస్, నాంద్రే అమర్‌నాథ్, అంకాల జనార్ధన్, సీనియర్ నాయకుడు బిక్ష కిషోర్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు వేల్పుల నందు, మడిపెల్లి నాగరాజు, కిసాన్ మోర్చా నాయకుడు ఇనుముల రాజు పాల్గొన్నారు.

● కరీమాబాద్: అరూరి రమేష్ జన్మదిన వేడుకలను 42వ డివిజన్ రంగశాయిపేటలో నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌చార్జి కర్నె రవీందర్, 39,40,41,42 డివిజన్ల అధ్యక్షులు బోరిగం నాగరాజు, ఆకుతోట రాజు, కర్నే వాసుదేవ్, తాళ్లపెల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో అరూరి జన్మదిన వేడుకలు జరిగాయి. ఆ పార్టీ నాయకుడు ముదుసు నర్సింహ బర్త్‌డే కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భిక్షపతి కట్టర్, పిట్ట సరస్వతి, పత్రి సుభాష్, సాంబయ్య, కుమార్, జయప్రకాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



14 వ డివిజన్‌లో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్

మాదిగలకు టికెట్ ఇవ్వని కాంగ్రెస్

7న సదస్సును విజయవంతం చేయాలి: ఎమ్మార్పీఎస్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4: రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వుడు ఎంపీ స్థానాలున్నా, 80శాతం మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ అన్నారు. గురువారం కాశిబుగ్గ ప్రతాప్‌నగర్ అంబేద్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులతో అత్యావసర సమావేశం జరిగింది. దినేష్ మాట్లాడుతూ వరంగల్‌లో ఈనెల 7న జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల వరంగల్ పార్లమెంట్ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్‌వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ హాజరుకానున్నారన్నారు. సమావేశంలో నాయకులు గంగారపు మల్లన్న, ఇసంపెల్లి రాజు, మహేందర్, అనిల్, క్రాంతి, నరేందర్, యోగి తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి.. నీట మునిగి యువకుడి మృతి

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 4: ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి గురువారం యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ మండిబజార్‌కు దుప్పటి రంజిత్(బంటి) (28) దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో నివాసముంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. బుధవారం ఏనుమాముల ప్రాంతంలోని ముసలమ్మకుంటలో ఈతకు కొడుతూ గల్లంతయ్యాడు. గురువారం ఉదయం మృతదేహం బయటకు తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీసి రంజిత్‌గా గుర్తించారు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రంజిత్‌కు ఏడాది క్రితమే వివాహమైంది.



రంజిత్ (ఫైల్)

అస్వస్థతకు గురై వృద్ధురాలి కన్నుమూత

సంగెం, ఏప్రిల్ 4 : తీవ్ర అవస్వస్తకు గురై, గుండెపోటు రావడంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. లోహితకు చెందిన పెదకాసు ఎల్లమ్మ(63) బుధవారం చాతిలో నొప్పిరావడంతో అస్వస్థత గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రవేట్ అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త గతంలోనే మృతి చెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఆశీస్సులు తీసుకున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ తన 58వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ రాష్ట్ర నాయకుల ఆశీస్సులను తీసుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కలవగా, అరూరితో కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఉన్నారు.





అరూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్

బీజేపీకి ఓటు వేయొద్దు : బీహెచ్‌పీఎస్

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: మను ధర్మశాస్త్ర భావజాలంతో ఉన్న బీజేపీకి ఓటు వేస్తే మనుధర్మ శాస్త్రానికి మద్దతు ఇచ్చినట్లేనని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని సంగీ ఏలేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక మతసామరస్యం తీవ్రంగా దెబ్బతిందన్నారు. దేశంలో దళితుల పైన దాడులు పెరిగిపోయాయన్నారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా, నగర నాయకులు జన్ను రవి, రొంటాల దేవ, రాచర్ల రాజేంద ర్, జన్ను శంకర్, హరిబాబు, పైడి, కోటి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గీసుగొండ, ఏప్రిల్ 4: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు ఆయాశాఖల పూర్తి సమాచారంతో రావాలని అన్నారు. ఉదయం 11 గంటల వరకు మండల పరిషత్ సమావేశం మందిరంలో ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

మాజీ కార్పొరేటర్‌కు కొండా పరామర్శ

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4: నగరంలోని 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భర్త మాజీ కార్పొరేటర్ భాస్కర్‌కు ఇటీవల అపెండిసైటీస్ ఆపరేషన్ జరిగిన నేథ్యంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. భాస్కర్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గోపాల నవీన్‌రాజ్, దాసరి రాజేష్, పద్మ గంగాధర్, గనిపాక సుధాకర్, వేముల నాగరాజు, మేకమల్ల వెంకటేష్, చింత క్రిష్ణ పాల్గొన్నారు.



భాస్కర్‌ను పరామర్శిస్తున్న మురళీధర్‌రావు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4: నగరంలోని 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లో ఉద్యోగం రాలేదని మనస్తాపంతో సారెకొక్కు అశోక్(32) బుధవారం మృతిచెంగా, గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మృతదేహానికి నివాళులర్పించారు. అశోక్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసాఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడుప మహేష్, అడిగొప్పుల సాంబేశ్వర్, ఎస్‌కె. జావిద్, పురాణం రవి, పత్తి రాజేష్, అభిలాష్, ఈర్ల రాజేందర్, డబ్బా రాములు, పత్తి కుమార్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 4: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సర్కిల్‌లో రైతు సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యిందని, సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు రూ. 25 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సత్యాగ్రహ దీక్షను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

రాజ్యసభ సభ్యుడిగా రవిచంద్ర ప్రమాణస్వీకారం

మట్టెవాడ, ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్ర సమితి రాజ్యసభ సభ్యుడిగా రెండోవ దఫా ఏకగ్రీవంగా ఎంపికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన రవి చంద్రను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీష్ ఘట్కర్, గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణం చేయించారు. రవిచంద్రకు రాజ్యసభ ఛైర్మన్ జగదీశ్ ఘట్కర్, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి పియుష్ గోయల్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ ఆదేశాలతో తెలంగాణ నుంచి రెండోవ దఫా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం రవిచంద్ర మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 4:లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతపై స్వీప్- 2024 అవగాన కార్యక్రమం గురువారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ కార్యాలయంలో గురువారం జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్ పర్సన్‌లకు నిర్వహించిన అవగహన కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్ గొడిశాల హజరై మాట్లాడారు. ఓటు మన భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని, ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టుగా నిలుస్తుందన్నారు. ఓటు హక్కును సామాజిక బాధ్యతగా భావించి అందరూ ఓటు వేయడంతో పాటు ఓట్లు వేయించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్ పర్సన్‌లు క్షేత్రస్థాయిలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ఓటు నమోదు శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఓట్లు వేయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఈ రాజయ్య, డీఎం రజితరాణి, డీఈ శివానంద్, ఏఈ లు హరికుమార్, విజలక్ష్మి, శ్రీకాంత్, మేనక, వెంకటేశ్వర్లు, రామన్న పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

'ఎత్తిపోతల'కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న రైతులు

చెన్నారావుపేట, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకానికి గురువారం రైతులు మరమ్మతులు చేశారు. పాకాల వాగుపై గత కొద్ది రోజులుగా నిరుపయోగంగా ఉండటంతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఆయకట్టు కింద ఉన్న రైతులందరూ కలిసి ఉపయోగంలోనికి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం పంటలకు సాగు నీరం దించటం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టి రవికుమార్, అడుప సత్తయ్య, గుర్రం నర్సయ్య, మండల రాయమల్లు, సీద్ద చిరంజీవి, బొంత సారయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికే గుర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, ఏప్రిల్ 4 : పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి రవీందర్‌రావును మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో విధేయతో పనిచేసిన రవీందర్‌రావుకు జిల్లా కాంగ్రెస్ కమిటి అధికార ప్రతి నిధి పదవీ దక్కిందన్నారు. పార్టీ కోసం విధేయతతో పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభించడంతో పాటు వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. జిల్లా కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మాజీ సర్పంచు చిలువేరు రజనీభారతి, మహిళా నాయకులు ఆడెపు రమ, పద్మాబాయి, శారద పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం పాటుపడాలి



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 4 : భారత రాజ్యాంగ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని తెలిపారు. కొంతమంది దేశంలో బీజేపీకి 400సీట్లు వస్తే అంబేడ్కర్ భవనాలను, విగ్రహాలను తొలగిస్తామని చెపుతున్నారని గుర్తు చేశారు. దళితులపై దేశంలో అఘాయిత్యాలు ఎక్కువై పోయాయని, మతతత్వ ముసుగులో బీజేపీ దేశ ప్రజల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఇటువంటి వారికి ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. రాజ్యాంగం పరిరక్ష కోసం అందరు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధులు సుధాకర్, బాబురావు, పురుషోత్తం, పాపారావు, రాంచందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం



సన్మానం చేస్తున్న నాయకులు

పర్వతగిరి, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి నియామకమైన జాటోత్ శ్రీనివాస్ నాయక్‌ను గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనీల్‌రావు, రాంచందర్‌రావు, శ్రీనివాస్, చలపతిరావు, గురువారావు, రాఘవులు, కనకరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు



కొంకపాక గ్రామ శివారులోని లోలెవల్ కల్వర్టు గుండా ప్రవహిస్తున్న నీరు

వర్షాలు పడితే ప్రయాణాలు కష్టమే...

నూతన కల్వర్టులు నిర్మించాలని డిమాండ్

పర్వతగిరి, ఏప్రిల్ 4 : రహదారుల గుండా సాగునీరు తరలడానికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఏర్పాటుచేసిన కల్వర్టులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎన్నో ఏళ్లక్రితం ఏర్పాటుచేసిన కల్వర్టులు వర్షపునీరు, ఆయా చెరువుల ద్వారా వచ్చే సాగునీటితో కోతలకు గురవుతుండడంతో పాటు కల్వర్టుల మీదుగా వాహనాలు ప్రయాణిస్తుండడంతో కూలిపోతున్నాయి. మరికొన్ని చోట్ల లోలెవల్ కల్వర్టులు ఉండడంతో వర్షాలు వచ్చిన సమయంలో కల్వర్టుల మీదుగా నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆయా రహదారుల గుండా వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

మూడు చోట్ల ప్రమాదకరంగా ...

మండలపరిధిలోని ప్రధాన రహదారుల్లో మూడు చోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. లోలెవల్ కల్వర్టులు కూడా కావడంతో చిన్నపాటి వర్షాలకు రోడ్డుపైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక వర్షాకాలంలోనైతే వరదనీటిలో వెళ్లలేక ప్రయాణాలను సైతం వాయిదావేసుకుంటున్నారు. మండలంలోని తురుకలసోమారం గ్రామశివారు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లోలెవల్ కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. గతంలో వరదనీటికి పలువురు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. కొంకపాక గ్రామశివారు కంఠ మహేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టు మీదుగా ప్రస్తుత వేసవికాలంలో సైతం నీరు ప్రవహిస్తోంది. గోపనపెల్లి గ్రామశివారులోని లోలెవల్ కల్వర్టు నుంచి రహదారి మీదుగా చెరువునీరు ప్రవహి స్తుంది. దీంతో వర్షాకాలంలో ఆయా గ్రామాల మీదుగా ప్రయాణాలు చేసేవారికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి.



సోమారం గ్రామ శివారులో శిథిలావస్థకు చేరిన కల్వర్టు

లోలెవల్ కల్వర్టులతో ప్రమాదాలు...

ఆయా గ్రామాల పరిధిలో లోలెవల్ కల్వర్టులు ఉండడంతో రోడ్లపైనుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు, వరదనీటితో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తురుకలసోమారం గ్రామపరిధిలోని లోలెవల్ కల్వర్టు వద్ద గతంలో వరదనీటిలో మనుషులు, పశువులు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత ఏడాది వర్షాకాలంలో వరదనీటి ఉధృతికి రెండు, మూడు రోజులు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగురోజుల పాటు ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. మిగతా రెండు కల్వర్టుల చోట ఇదే పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాలంటే అనేక వ్యయప్రయాసాలకోర్చాల్సి వస్తుందని వాపోతున్నారు.

కల్వర్టులు నిర్మించాలి

శిథిలావస్థకు చేరుకున్న లోలెవల్ కల్వర్టు స్థానంలో నూతన హై లెవల్ కల్వర్టులు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇదే మండలం నుంచి మంత్రులు, వివిధ పదవుల్లో ఉన్న వారు ఆయా కల్వర్టులను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా నూతన కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు. ప్రస్తుత వేసవి కాలంలోనే పనులను చేపట్టి వర్షాకాలం నాటికి పూర్తిచేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అంటున్నారు. లేకపోతే రాబోయే వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నెక్కొండ, ఏప్రిల్ 4 : నేటి బాలలు రేపటి పౌరులని శిశు తరగతి నుంచే విద్యల్లో రాణించడానికి గురువులు, తల్లిదండ్రుల సహకారం ఉండాలని నెక్కొండ విద్యోదయ గురుకుల విద్యాలయం కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి అన్నారు. గురువారం విద్యాలయంలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ గౌన్‌లను ధరించిన చిన్నారులకు మార్కుల జాబితాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజతం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పర్వతగిరి, ఏప్రిల్ 4 : మండలంలోని చింతనెక్కొండ, చౌటపెల్లి, సోమారం, పర్వతగిరి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తప్పనిసరిగా తమ ధాన్యాన్ని విక్రయించి, మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కృష్ణమూర్తి, సీసీలు సుధాకర్, రవీందర్‌రాజు, కాంతయ్య మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై

చెన్నారావుపేట, ఏప్రిల్ 4 : అదృశ్యమైన విద్యార్థినిని అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై గూడ అరుణ్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హై స్కూల్‌లో ఎని మిదో తరగతి చదువుతున్న బోడ గణేష్‌కు హాస్టల్‌లో ఉండి చదవటం ఇష్టంలేక రెండు రోజుల క్రితం వెళ్లిపోయాడు. విద్యార్థి నేరుగా హైదరాబాద్‌లో తన తల్లిదండ్రులు పనిచేసే చోటుకు వెళ్లాలని భావించి హైదరాబాద్‌కు చేరుకున్నాడు. బస్‌స్టాండ్ ప్రాంతంలో ఒక రోజంతా తిరిగాడు. గురువారం ఉదయం గణేష్ బంధువుల ఇంటికి చేరుకున్నాడు. విద్యార్థి ఆచూకి కోసం చెన్నారావుపేట పోలీసులు, బంధువుల కలిసి వెళ్లి హైదరాబాద్ బస్‌స్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తు న్న క్రమంలోనే, హైదరాబాద్‌లోని బంధువులు తమ ఇంటి వద్దనే గణేష్ ఉన్నాడని ఫోన్‌లో పోలీసులకు సమాచారం అందించారు. గణేష్‌ను బంధుల ఇంటినుంచి పోలీసులు చెన్నారావుపేటకు తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి గణేష్‌ను అప్పగించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న నరేంద్ర మోదీ



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

నెక్కొండ, ఏప్రిల్ 4 : గత పదేళ్లుగా భారతదేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న పథకాలు, పరిపాలన ప్రపంచదేశాలకే ఆదర్శంగా నిలుస్తుడడంతో దేశ ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారని మహబుబాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటిసారి గురువారం నెక్కొండకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎంపీగా పనిచేసిన కాలంలో తాను చేసిన అభివృద్ధి పనులు, ప్రజా సేవలను గుర్తించిన బీజేపీ అధిష్టానం తనకు ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కాల్పించిదన్నారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను కాపడుతున్న ఏకైక పార్టీ బీజేపీ నుంచి తనకు పోటీచేసే అవకాశం దక్కడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. మేధావులకు పాలకులుగా అవకాశం కల్పించిన దేశాల్లో ఎనలేని అభివృద్ధి జరుగుతుందని, ప్రజలు తప్పకుండా ఈ ఎన్నికల్లో తనను ఆదరిస్తారని, విజయం ఖాయమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో విసుగెత్తిన ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారే తప్పా కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో కాదన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 400పైగా సీట్లలో విజయం కాయమన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నియోజకవర్గం నాయకుడు కంభంపాటి పుల్లారావు, నియోజకవర్గం చేరికల కమిటీ కన్వీనర్ గోగుల రాణాప్రతాప్, అంబాల రాంగోపాల్, పులి ప్రసాద్, కాసుల రత్నయ్య, అంబాల అనిల్, కుడికాల సందీప్, పింగళి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- చెన్నారావుపేట : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం రైతుల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో తనను తిరిగి పార్లమెంటుకు పంపించాలని కోరారు. అనంతరం ఇటీవల మృతి చెందిన గాదేగోని సదయ్య, ఇజ్జగిరి ఐలయ్య కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నూకల కృష్ణ, జిల్లా నాయకులు వనపర్తి మల్లయ్య, లక్ష్మీనారాయరణ, వీరమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్య గెలుపు ఖాయం



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న బర్ల సహదేవ్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 4 : జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్‌నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడియం కావ్య గెలుపు ఖాయమని నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సూచించిన అభ్యర్థి కావ్య గెలుపు కోసం మండల, గ్రామ నాయకులు కృషిచేయాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందంచేసుకుని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ప్రజలు పదేండ్లు అధికారం ఇస్తే చేసిందేమి లేదన్నారు. పదేళ్ల అధికారంలో కేసీఆర్ కుటుంబం లబ్ధిపొంది, ప్రజాధనాన్ని లూటీచేశారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కల్వకుంట్ల ఫ్యామిలీ నిలిచిందని తెలిపారు. అధికారం కోల్పోవడంతోపాటు పార్టీలో ముఖ్య నాయకులు వెళ్లిపోతుండడంతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేపు తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ భారీ బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు వచ్చేలాచూడాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు.అంతకుముందు నూతనంగా వర్ధన్నపేటకు వచ్చిన సందర్భంగా మండల నాయకులు సహదేవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, సీనియర్ నాయకులు మహ్మద్ అప్సర్, చిదురాల కుమారస్వామి, సమ్మెట రాంబాబు, కొండేటి బాలకృష్ణ, మల్లెపాక సమ్మయ్య, శివరాత్రి ఎల్లస్వామి, షబ్బీర్, చంద్రమౌళి, బాస్కర్, వెంకన్న, యాకయ్య పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడిన మహిళ



గాయపడిన అంగోతు బాణీ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 4: ఆర్టీసీ బస్సు నుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిన మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని డీసీ తండాలో గురువారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ కథనం ప్రకారం... డీసీతండాకు చెందిన అంగోతు బాణీ కడుపు నొప్పితో బాధపడుతుండగా తన కుమారుడు ఆటోలో తీసుకుని వెళ్లి వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి వర్ధన్నపేట బస్టాండ్‌లో ఆర్టీసీబస్సు ఎక్కించాడు. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళ డీసీ తండా వద్ద దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా మహిళ కిందపడి పోయింది చూడకుండా ముందుకు వెళ్లడంతో బస్సుటైరు ఆమె కాలుపై నుంచి వెళ్ల డంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో తండావాసులు వెంటనే బస్సును నిలిపి వేసి డ్రైవర్ గంజి నారాయణరెడ్డికి దేహశుద్ధి చేశారు. గాయాలైన మహిళను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధిత మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ఖానాపురం, ఏప్రిల్ 4: బొలెరో ట్రాలీ, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బుధరావుపేట గ్రామానికి చెందిన చిట్యాల వీరన్న, మంగళవారిపేట గ్రామానికి చెందిన పుష్పలత ఇద్దరు ద్విచక్రవాహనంపై గురువారం నర్సంపేట నుంచి బుధరావుపేటకు వెళ్తుండగా ఖానాపురం మండల కేంద్రంలో వెనుక నుంచి వచ్చిన మద్యం లోడుతో ఉన్న బొలెరో ట్రాలీవాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా వీరన్నకు, పుష్పలతకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు నర్సంపేటకు చికిత్స నిమిత్తం తరలించారు.

అదుపు తప్పిన ఆటో...

చెన్నారావుపేట, ఏప్రిల్ 4 : ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి దూసుకెళ్లడంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలోని పాతమగ్దుంపురం గ్రామ శివారు ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నెక్కొండ వైపు నుంచి నర్సంపేటకు ఆటో వెళ్తున్న క్రమంలో పాతమగ్దుంపురంలో లోలెవల్ వంతెన సమీపంలోనికి రాగానే అదుపు తప్పిన ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు అతని భార్యకు స్వల్ప గాయలు కాగా, నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

అక్రమ మద్యం స్వాధీనం

పర్వతగిరి, ఏప్రిల్ 4 : అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల పక్రారం... మండలంలోని దూపతండాకు చెందిన బానోత్ దయాకర్ అనే వ్యక్తి తన కిరాణాషాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా గురువారం దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ విలేకరులు

రాయపర్తి, ఏప్రిల్ 4 : మండలానికి చెందిన ఇద్దరు నకిలీ విలేకరులు పోలీసుల అదుపులో ఉన్నట్లు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను టార్గెట్‌గా చేసుకుని ఇద్దరు విలేకరులు అనుదినం పాఠశాలకు వెళ్తూ ఉపాధ్యాయులు సమయం పాటించడం లేదని వేధిస్తున్నారు. ఈ విషయమై ఓ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయులతో వాగ్వాదం కాగా, ఓ మహిళా ఉపాధ్యాయురాలిని పరుష పదజాలంతో మాట్లాడడంతో ఆమె ఈ నెల 1న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నేడు వారిని రిమాండ్‌కు తరలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెపుతున్నారు.

ఘనంగా అరూరి జన్మదిన వేడుకలు



వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 4 : వరంగల్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపరపు కుమారస్వామి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దూరి రాజ్‌కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఐత రవి, సీనియర్ నాయకులు గుగులోతు తేజనాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ గుడ్ల సుభాష్, నాయకులు కొండబోయిన సాయిలు, సిద్దం శ్రీనివాస్, మచ్చ సమ్మయ్య, భూక్యా రాజేందర్, తాళ్లపెల్లి కృష్ణమూర్తి, జోలి సతీష్, కర్క సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పర్వతగిరి : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినోద్‌కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, నాయకులు రంగు కుమార్, ఆడెపు ప్రభాకర్, చీమల భిక్షపతి, చీమల చంద్రయ్య యాకయ్య, నర్సయ్య, ప్రభాకర్, వెంకటేష్, మధు, రవి పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడిగా రవిచంద్ర ప్రమాణ స్వీకారం

మట్టెవాడ, ఏప్రిల్ 4 : తెలంగాణ రాష్ట్ర సమితి రాజ్యసభ సభ్యుడిగా రెండోవ దఫా ఏకగ్రీవంగా ఎంపికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన రవిచంద్రను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీష్ ఘట్కర్, గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణం చేయించారు. రవిచంద్రకు రాజ్యసభ ఛైర్మన్ జగదీష్ ఘట్కర్, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి పియూష్ గోయల్ శుభాకాంక్షలు తెలిపారు. రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ ఆదేశాలతో తెలంగాణ నుంచి రెండో దఫా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. రవిచంద్ర మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతపై స్వీప్-2024 అవగాన కార్యక్రమం గ్రేటర్‌వరంగల్ నగర పాలకసంస్థ కౌన్సిల్ కార్యాలయంలో జరిగింది.అమ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్‌పర్సన్‌లకు నిర్వహించిన అవగహనలో నగర పాలకసంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు నయీంనగర్ నాలా బ్రిడ్జి కూల్చివేత

రూ.15 కోట్లతో చేపట్టనున్న కొత్తబ్రిడ్జి, నిర్మాణ పనులు

3 నెలల పాటు వాహనాల రాకపోకలు బంద్

నయీంనగర్, ఏప్రిల్ 4 : హనుమకొండ నయీంనగర్‌లో ప్రధాన రహదారిలో ఉన్న నాలా పాతబ్రిడ్జిని శుక్రవారం మునిసిపల్ అధికారులు కూల్చనున్నారు. దీని స్థానంలో రూ.15 కోట్లతో కొత్త వంతెనను కట్టనున్నారు. మూడునెలల్లో వర్షాకాలం రానుండటంతో ఈలోపే పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ కొత్త బ్రిడ్జి పూర్తయితే వరదముంపు సమస్య నుంచి ప్రజలు బయటపడే అవకాశం ఉంది.

ఎన్నో సంవత్సరాలుగా నయీంనగర్ నాలా చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న కాలనీలు చిన్నపాటి వర్షానికే వరద ముంపునకు గురవుతున్నాయి. చుట్టూ ఉన్న ప్రజలు వరదతో ఎన్నోసార్లు ఆస్తినష్టాలకు గురయ్యారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో నయీంనగర్ నాలావెడల్పు, కొత్త బ్రిడ్జిలకు రూ.15 కోట్లు మంజూరు చేయించి, పనులు చేపడుతున్నారు. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న రెడ్డి చికెన్ సెంటర్ నుంచి లష్కర్‌సింగారం మెయిన్ రోడ్డు వద్ద గల రంగ్‌బార్ వరకు నయీంనగర్ కొత్త బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఈకొత్త బ్రిడ్జి పూర్తయితే వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు..

నయీంనగర్ నాలాక్రొత్త బ్రిడ్జి పనులు నేడు ప్రారంభం కానున్నాయి. దీంతో హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న రెడ్డి చికెన్ సెంటర్ వద్ద నుంచి లష్కర్‌సింగారం రంగ్‌బార్ వరకు దాదాపు అర కిలోమీటరుకుపైగా రోడ్డు మధ్యలో నుంచి తవ్వకాలు జరుపనున్నారు. ప్రయాణికులు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శుక్రవారం నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

- కరీంనగర్ నుంచి ఖమ్మం, నర్సంపేట, వరంగల్ వైపునకు భారీ వాహనాలు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ, ఆటోనగర్ మీదుగా వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి వచ్చే ఆర్‌టీసీ బస్సులు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు జంక్షన్, అమృత జంక్షన్, హనుమకొండ చౌరస్తా మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- ఖమ్మం నుంచి కరీంనగర్ వైపు భారీ వాహనాలు వరంగల్ ఉర్సుగుట్ట, కడిపికొండ, మడికొండ, ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలి.
- వరంగల్, నర్సంపేట వైపునుంచి కరీంనగర్ వైపునకు భారీ వాహనాలు ఎంజీఎం, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా పోవాల్సిఉంది.
- హనుమకొండ నుంచి కరీంనగర్ వైపువెళ్లే ఆర్‌టీసీ బస్సులు హనుమకొండ చౌరస్తా, అమృత జంక్షన్, ములుగురోడ్డు జంక్షన్, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లవలెను.